డిటెక్టివ్ ఖదలు

# ఆఫ్రికా యాత్రికుడి హత్య

## ఎలెరీ క్వీన్

యూనివర్సిటీ ఆర్ట్సు బిల్డింగు ఎనిమిదో అంతస్తు నడవాగుండా కష్టం మీద ముందుకు కదుల్తున్నాడు ఎలెరీ క్వీన్. కాలేజీ కుర్రాకారు గొంతులు గోలగోలగా అతని చెవుల తుప్పు వదలగొడుతున్నాయి.

విద్యార్థుల గుంపొకటి గట్టిగా అరుచుకుంటూ, కేరింతలు కొట్టుకుంటూ ముందుకొస్తోంది. చేతి కర్ర సాయంతో ఆ గుంపులోంచి దారి చేసుకుని ముందుకు నడుస్తూ నిట్టూర్చాడతను. ఇదీ న్యూయార్క్‌లో చదువు.

టీనేజ్‌లో వుండగా అతనూ హార్వర్డు యూనివర్సిటీ స్టూడెంటే. ప్రస్తుతం అచ్చమైన ప్రొఫెసర్లా ట్వీడ్ సూట్లో వున్నాడు. చేతిలో కర్ర పట్టుకున్నాడు. కళ్లద్దాలు పెట్టుకున్నాడు. వృత్తిరీత్యా నేరాల్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి అలవాటు పడిన అతని చురుకైన కళ్ళు కాలేజీ అమ్మాయిల్ని కళ్ళద్దాలగుండా సునిశితంగా గమనించాయి. తను స్టూడెంటుగా వున్న రోజుల్లో ఈ చక్కని చుక్కలే తన కో—స్టూడెంట్లుగా వుంటేనా!

అతనోసారి తల విదిలించి ఆ అల్లరి చిల్లరి వూహల్లోంచి బయట పడుతూ ముందుకు సాగాడు. అంతలోకే ఆడపిల్లల బెటాలియన్ ఒకటి కిలకిలా నవ్వుకుంటూ అతనికి ఎదురొచ్చింది. కంపరంగా వాళ్ళనుంచి తప్పించుకుంటూ తన గమ్యస్థానమైన 824వ నెంబరు గది ముందుకొచ్చి పడ్డాడతను.

అక్కడొక లేడీకళ్ళ సుందరాంగి సాక్షాత్కరించింది. మూసివున్న ఆ గది తలుపుకు విలాసంగా ఆనుకొని తన కోసమే ఎదురు చూస్తున్నట్టుగా కనిపించిందామె. ఆ తలుపుకు తగిలించిన చిన్న కార్డు ముక్కొకటి ఆమె వెనక దాక్కుండిపోయింది.

''అప్లయిడ్ క్రిమినాలజీ— మిస్టర్ క్వీన్' అని రాసుందా అట్టముక్క మీద.

ఎంత దురహంకారం ఈ పిల్లకి.

అతనలా అనుకుంటుండగానే సదరు లేడికళ్ళు అతనివంక ఆరాధన పూర్వకంగా చూశాయి.

దాంతో ఎలెరీకాస్త ఇబ్బందిలో పడిపోయాడు. నిజంగా ప్రొఫెసరైతే ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితిలో ఏం చేస్తాడు? ఈవిడగారు ఆడపిల్ల అనే విషయం పక్కకునెట్టి కఠినంగా మాట్లాడేస్తాడా?

అతనింకా అలా ఆలోచించుకుంటూనే వున్నాడు. ముందుగా మాట్లాడే ఛాన్సు ఆమె కొట్టేసింది.

''ఎలెరీ క్వీన్ గారు మీరేనా సార్?''

''నేను...'' తడబడ్డాడు ఎలెరీ.

''నాకు తెలుసు. మీరే ప్రఖ్యాత డిటెక్టివ్ ఎలెరీ క్వీన్, ఆ కళ్ళని చూసే చెప్పేయొచ్చు. మీ కళ్ళు నిజంగా సూపర్బ్ సార్. ఇక మీదట థ్రిల్లంటే థ్రిల్లు.??

''ఏమిటమ్మాయ్, ఏదో అంటున్నావ్?''

''ప్రఖ్యాత డిటెక్టివ్ ఎలెరీ క్వీన్ మీరేనా అనడుగుతున్నాను సార్. ఓహ్, నేనెవరో చెప్పనే లేదు కదూ. నన్ను ముసలి ఇక్కీ పంపించాడు.''

''ముసలి ఇక్కీ! ఆయనెవరు?''

''అయ్యో, మీకా మాత్రం కూడా తెలీదా? మీరెలా డిటెక్టివయ్యారు సార్? ముసలి ఇక్కీ అంటే ప్రొఫెసర్ ఇక్త్రార్సే, బి.ఏ., ఎం.ఏ., పి.హెచ్.డి. బాప్‌రే, ఇంకా ఎన్ని డిగ్రీలున్నాయో ఆయనకే తెలియాలి.''

''ఆహా! ఇప్పుడు నాకర్థమైంది'' అన్నాడు ఎలెరీ.

''ఏమిటి మహా అర్థమైంది? ముసలి ఇక్కీ మా నాన్నే'' అంటూనే బోలెడు సిగ్గుపడిపోయిందామె.

కనీసం ఎలెరీ అలా అనుకున్నాడు. ఎందుకంటే ఆ మాట అంటుండగానే విసన కర్రల్లాంటి ఆమె కనురెప్పలు అందంగా వాలిపోయాయి.

''ఓహో, అయితే తమరు మిస్ ఇక్త్రార్సే అన్న మాట! ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమైంది. అప్లైడ్ క్రిమినాలజీ మీద ప్రొఫెసర్ ఇక్త్రార్సే నన్ను లెక్చర్లివ్వమని ఆహ్వానించారు. కాబట్టి తమరు ఇక్త్రార్సే గారి పుత్రికారత్నం కాబట్టి— నేను లెక్చరిచ్చే గ్రూపులోకి చల్లగా దూరిపోదామనుకున్నావ్. అంతేనా? ఎంత తెలివి! వీల్లేదు. వీల్లేదంటే వీల్లేదు'' అనేస్తూ తన చేతికర్రని ఆమె తెలివి తేటలు కొలిచే స్కేలు నిటారుగా నేల మీద నిలబెట్టి దాని మీద వాలాడు ఎలెరీ.

అతనా మాట పూర్తి చేశాడో లేదో ఆమె కుడికాలు సూటిగా వచ్చి ఆ చేతికర్రని తన్నేమంటూ ఢీకొట్టింది. దాంతో ఎలెరీ పడబోతూ నిలదొక్కుకున్నాడు.


''స్టయిలు కొట్టకండి సార్. నేను మీ దగ్గరే చదువుకుంటాను. నా మాటకు తిరుగులేదు. మిస్టర్ క్వీన్— మీ పేరు భలే అందంగా వుంటుంది సార్. ఇక పాఠం ప్రారంభించేద్దామా సార్?''

''కానీ...''

''నేను మీదగ్గర చదువుకోవడానికి ముసలి ఇక్కీ పర్మిషనిచ్చేశాడు సార్.''

''కానీ, నేను మాత్రం పర్మిషనివ్వట్లేదు.''

''మరీ ప్రొఫెసర్లా ఫోజు కొట్టేయకండి సార్. అయినా మీ దగ్గర చదువుకోవడానికి నాకేం తక్కువ? బియ్యే పాసయ్యాను. మాస్టర్స్ కోర్సు చేస్తున్నాను. నాకు బోలెడు తెలివి తేటలు కూడా వున్నాయి. నాకు చదువు చెప్పరూ? మీ కళ్ళెంత బావున్నాయో! నిజంగా మీరింత చిన్న వయసు వారనుకో



దాదాహాయాత్

లేదంటే నమ్మండి సార్."

ఆ మాటతో ఎలెరీ సంతోష పడిపోయాడు. "ఓహ్, వెరీవెల్! అయితే పద మరి" అనేశాడు.

అదో చిన్నక్లాస్ రూం. వాళ్ళిద్దరూ లోనికి వెళ్తూనే ఇద్దరు యువకులు లేచి నిలబడ్డారు. 'ఫరవా లేదు— వినయం గల కుర్రాళ్ళు' అనుకున్నాడు ఎలెరీ.

అతన్తో పాటు మిస్ ఇక్తార్సే కూడా అనుకోకుండా దర్శనమిచ్చేసరికి ఆ ఇద్దరి కుర్రాళ్ళూ మొదట ఆశ్చర్యపోయారే గానీ మరీ ఇదై పోలేదు. ఆవిడగారి సంగతి అందరికీ తెలుసునే సంగతి తెలిసిపోతూనే వుంది. ఆ ఇద్దరు కుర్రాళ్ళలో ఒకతను ముందు కొచ్చి ఎలెరీకి షేక్ హేండిచ్చాడు.

"నా పేరు బరోన్, సార్— జాన్ బరోన్. అంతమంది అభ్యర్థుల్లో నన్నూ వాల్టర్నీ మీ స్టూడెంట్లుగా సెలెక్టుగా చేసుకున్నందుకు చాలా థ్యాంక్స్ సార్" అన్నాడు.

"మంచి కుర్రాడు? అనుకున్నాడు ఎలెరీ. ఆ కుర్రాడి కళ్ళు మెరుస్తున్నాయ్. మొహంలో తెలివి తేటలు స్పష్టంగా కనబడుతున్నాయి.

"ఇందులో నేను చేసిందేం లేదు. నీ రికార్డు బావుంది. అందుకే స్టూడెంట్‌గా తీసుకున్నాను. పోతే, అతను వాల్టర్ క్రేన్ అయ్యుండాలి. అవునా?" అన్నాడు ఎలెరీ.

ఆ రెండో యువకుడు మరింత వినయంగా అతనికి షేక్ హేండిచ్చాడు.

"నేను వాల్టర్ క్రేన్ని సర్. కెమిస్ట్రీలో డిగ్రీ తీసుకున్నాను. అప్లైడ్ క్రిమినాలజీలో మీ చేత లెక్చర్లిప్పించాలని ప్రొఫెసర్ ఇక్తార్సే గారు తీసుకున్న నిర్ణయం అద్భుతంగా వుంది. నాకా సబ్జెక్టు మీద చాలా ఇంట్రెస్టుంది" అన్నాడతను. ఎత్తుగా బలంగా వున్నాడు. కష్టపడి చదివే కుర్రాడిలా చక్కగా కనిపిస్తున్నాడు.

"బావుంది. ఈవిడ మిస్ ఇక్తార్సే. మన గ్రూపులో చేరిన నాలుగో మెంబరు. అనుకోకుండా ఈమెనీ చేర్చుకోవలసి వచ్చింది. వెల్, మనం కూర్చొని మాట్లాడుకుందాం" అన్నాడు ఎలెరీ.

ఆ ఇద్దరు కుర్రాళ్ళూ తమ సీట్లోలోకి దూకేశారు. మిస్ ఇక్తార్సే కూడా బుద్ధిగా ఓ చోట కూర్చుంది. ఎలెరీ తన హ్యాటూ, చేతికర్రా ఓ మూల పడేస్తూ రెండు చేతులూ టేబుల్ మీదానించి ఎలా ప్రారంభించాలో తోచక పై కప్పు వంక చూశాడు. ఎలాగో ప్రారంభించాక తప్పదు మరి.

"నిజం చెప్పాలంటే ఇదంతా పెద్ద నాన్సెన్సనే అనాలి. అయినప్పటికీ ప్రొఫెసర్ ఇక్తార్సే గారికి ఈ అయిడియా రావడంలో ఎంతోకొంత మంచి కూడా వుంది. పరిపూర్ణమైన విశ్లేషణద్వారా నేరాలు పరిష్కరించడంలో నేను సాధించిన కొద్దిపాటి విజయాల గురించి ప్రొఫెసర్ ఇక్తార్సే వినడం తటస్థించింది. దాంతో యూనివర్సిటీ విద్యార్థుల్లో కూడా విశ్లేషణ ద్వారా కనిపెట్టగల ఆలోచనా శక్తి ఎందుకు కలిగించగూడదనే అయిడియా తట్టిందాయనకు. ఆ అయిడియాని పదిలంగా తెచ్చి నా చేతుల్లో పెట్టాడు. మొదట్లో నేను కొంత తటపటాయించాను. ఎందుకంటే నేనూ ఒకప్పుడు యూనివర్సిటీ స్టూడెంటునే కదా, స్టూడెంట్లు ఎలా వుంటారో నాకు తెలుసు" అన్నాడు.

"అప్పటి రోజులు వేరులెండి. ఇప్పుడంతా మేధావులే చదువుకోవడానికి వస్తున్నారు" అంది మిస్ ఇక్తార్సే.

"ఊ, మీరెంతా ఎంతటి మేధావులో చూడాల్సిందే మరి" పొడిగా అన్నాడు ఎలెరీ. "సిగరెట్టు లేందే నేనాలోచించలేను. రూల్సుకు విరుద్ధమైనా క్లాస్‌రూంలో నేను సిగరెట్టు కాల్చక తప్పదు. కావాలంటే మీరు కాల్చుకోవచ్చు సిగరెట్లు. నీకూ సిగరెట్టు కావాలా మిస్ ఇక్తార్సే?"

ఆమె పరధ్యానంగా ఓ సిగరెట్టు అందుకుని తన సొంత అగ్గిపుల్లతో వెలిగించుకుంది. తర్వాత సూటిగా ఎలెరీ కళ్ళలోకే చూడసాగింది.

"ప్రాక్టికల్స్ మొదలెడదామా సార్?" అన్నాడు క్రేన్. కెమిస్ట్రీ స్టూడెంటు కాబట్టి అతనికి ప్రాక్టికల్స్ అంటే ఇష్టం.

"తప్పకుండా" అంటూ ఎలెరీ లేచి నిలబడిపోయాడు. "మిస్ ఇక్తార్సే, నువ్వు మరీ పరధ్యానంగా వున్నావు. దయచేసి శ్రద్ధగా విను. డిటెక్షనంటే ఏమిటో మీరంతా తెలుసుకోవాలంటే సరైన పద్ధతిలో మనం ప్రొసీడవ్వాలి. ఈ సందర్భంగా మనం స్టడీ చేయాల్సింది క్రైం అనే విషయం మీకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్ని మనం స్టడీ చేయాల్సి వుంటుంది. ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. అపరాధ పరిశోధనలో ఎప్పుడూ ముందుగానే ఒక నిర్ణయానికి రాకూడదు, అండర్ స్టాండ్? మీరంతా నేను చెప్పిన ప్రకారం చేయాల్సి వుంటుంది. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం" అన్నాడు.

అతను చెబుతున్నదంతా ఆసక్తిగా వింటున్న బరోన్ మొహం ప్రకాశిస్తోంది. "మరైతే థియరీ



సర్? డిటెక్షన్లో ప్రాథమిక సూత్రాల గురించి చెప్ప రా? అంటే— క్లాస్ రూం లెక్చర్లు?'' అడిగాడు.

''ప్రాథమిక సూత్రాలూ లేవు, గాడిద గుడ్డూ లేదు,'' అంటూనే నాలిక్కొర్చుకున్నాడు ఎలెరీ. అతని భాషకు మిస్ ఇక్త్రార్స్ కిసుక్కుమంది.

''మిస్ ఇక్త్రార్స్!'' అంటూ ఆమెకేసి గుర్రుగా చూసి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడతను.

''చూడు బరోస్, ఈత నేర్చుకోవాలంటే సరైన పద్ధతి నీళ్ళలోకి దిగడమే. ఈత ఎలా కొట్టాలో థియరీ చెప్పుకుంటూ కూర్చోవడం వల్ల లాభం లేదు. అపరాధ పరిశోధన కూడా అంతే. ఈ కోర్సుకి మొత్తం అరవై ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు పెట్టుకున్నారు. నేను ఇద్దర్నో ముగ్గుర్నో మాత్రమే తీసుకోవాలనుకున్నాను. ఎక్కువ మందైతే నా ఉద్దేశం నెరవేరదు. క్రేన్‌లో విశ్లేషణాత్మకంగా ఆలోచించగల శక్తి ఉన్నదనిపించి అతన్ని తీసుకున్నాను. అదీగాక అతను సైన్సు స్టూడెంటు. పరిశీలనా జ్ఞానం ఎక్కువుంటుందనిపించింది. బరోస్‌కు అకాడమికల్‌గా మంచి రికార్డుంది. అతనెప్పుడూ ఫస్టే కాబట్టి అతన్ని తీసుకున్నాను.''

ఆ యువకులిద్దరు మొహాలూ బిడియంతో ఎర్రబడ్డాయి.

''ఇకపోతే మిగిలింది మిస్ ఇక్త్రార్స్. చూడు మిస్ ఇక్త్రార్స్, నిన్నెవరూ ఈ కోర్సుకి సెలెక్టు చేయలేదు. నిన్ను నువ్వే సెలెక్టు చేసుకున్నావు. కాబట్టి నీ బాధ్యత నువ్వే తీసుకోవలసి వుంటుంది. కొంచెం తెలివి తక్కువతనం ప్రదర్శించినా నిన్ను బయటికి నడిపిస్తాను. ముసలి ఇక్కీ కూతురివైనా మరెవరివైనా లెక్క పెట్టేది లేదు'' బిర్ర బిగుసుకుపోతూ అన్నాడు ఎలెరీ.

''ప్రొఫెసర్ ఇక్త్రార్స్ కూతురు ఎన్నటికీ తెలివిలేని కాదు సార్. ఆ విషయం మీరే తెలుసుకుంటారు'' అందామె.

''నేనాశించేది కూడా అదే. ఇక కేసుల విషయానికొద్దాం. ఓ గంట క్రితం నేను యూనివర్సిటీకి బయల్దేరి వచ్చేముందు పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఓ వార్త ఫ్లాషైంది. స్పార్గో అనే వ్యక్తినెవరో హత్య చేశారు. నేను విన్నదాన్ని బట్టి ఈ హత్యలో ఆసక్తికరమైన అంశాలు చాలా వున్నాయని తెలుస్తోంది. మా నాన్నగారెవరో మీకు తెలుసా?— ఇన్స్‌పెక్టర్ క్వీన్. ఆయన్ని వెంటనే అక్కడికి వెళ్ళి హత్యాస్థలాన్ని మనకోసం ఎలా వున్నదలాగే వుంచమని కోరాను. కాబట్టి, జరిగింది ట్రాజెడీ అయినా కోర్సు ప్రారంభిస్తూనే మీకుఇలాంటి సువర్ణావకాశం రావడం అదృష్టమనే చెప్పాలి.''

''గ్రేట్!'' ఆనందంతో అరిచాడు బరోస్. ''నేరంతో ఢీడిక్కీ! హత్యాస్థలానికి మనల్ని రానిస్తారా సార్?'' అంటూ క్రేన్ ప్రశ్న వేశాడు.

''దానికి ఇబ్బందేం లేదు. నా గధ్దర స్పెషల్ పోలీస్ పాసు ఒకటుంది. అలాంటి పాసులే మీ ఇద్దరికీ ఇప్పించే ఏర్పాటు ముందే చేసి పెట్టాను. నీకోసం కూడా అలాంటి పాసు తర్వాత ఇప్పిస్తాను మిస్ ఇక్త్రార్స్. మీ అందర్నీ ముందే హెచ్చరిస్తున్నాను. హత్యాస్థలంలో మీరేదీ ముట్టుకోకూడదు కనీసం నా అనుమతి లేనిదే ఏదీ కదిలించకూడదు. పత్రికా విలేఖరుల అడిగే ప్రశ్నలకు ఎట్టి పరిస్థితుల్లోనూ సమాధానాలు చెప్పగూడదు'' అన్నాడు ఎలెరీ. ''హత్యా కేసా?'' ఉన్నట్టుండి కుదేలైపోతూ అంది మిస్ ఇక్త్రార్స్. (మిగతాది వచ్చేవారం.)

# ఎలెరీ క్వీన్

## డిటెక్టివ్ సాహిత్యానికి ప్రతిభతో జీవం పోశారు

ఎలెరీ క్వీన్' అనేది ఒక్క రచయిత పేరు కాదు. ఫ్రెడెరిక్ డానే, మాన్ఫ్రెడ్‌లీ అనే జంట రచయితలు కలిసి పెట్టుకున్న కలం పేరు. తమాషా ఏమిటంటే వీళ్ళిద్దరూ సృష్టించిన డిటెక్టివ్ పేరు కూడా ఎలెరీ క్వీనే.

ఈ జంట రచయితలు పుట్టిన సంవత్సరం కూడా ఒకటే— 1905. ఇరవై మూడేళ్ళ వయసులో వీళ్ళిద్దరూ కూడబలుక్కుని 'ది రోమన్ హ్యాట్ మిస్టరీ' అనే నవల రాసి ఓ పత్రిక నిర్వహిస్తున్న డిటెక్టివ్ నవలల పోటీకి పంపించారు. మొదట వీరి నవలకే ప్రథమ బహుమతి ప్రకటించడం జరిగింది. అయితే అంతలోకే పత్రిక యాజమాన్యం మారిపోవడంతో ఆ నిర్ణయంలో కూడా మార్పు జరిగి ఆ బహుమతి మరో నవలకు పోయింది. ఏది ఏమైనా ఎలెరీ క్వీన్ నవల మాత్రం వెలుగు చూసింది. ఆ రోజు నుంచీ పుంఖానుపుంఖాలుగా మహత్తరమైన డిటెక్టివ్ నవలలు ఎలెరీ క్వీన్ పేరుతో వెలువడనారంభించాయి. 'ది ఫ్రెంచి పౌడర్ మిస్టరీ?, 'ది చైనీస్ ఆరెంజ్ మిస్టరీ', 'ది ఈజిప్షియన్ క్రాస్ మిస్టరీ' వంటి నవలలు డిటెక్టివ్ సాహిత్యంలోనే అత్యుత్తమమైన నవలలుగా ఎన్నదగినవాటిలో స్థానం సంపాయించుకున్నాయి.

ఎన్ని నవలలు రాసినప్పటికీ ఎలెరీ క్వీన్ జంటకు వచ్చిన సాహిత్య ప్రక్రియ మాత్రం చిన్నకథే. తాము స్వయంగా చిన్న కథలెన్నో రాయడం మాత్రమే కాకుండా 'ఎలెరీ క్వీన్ మిస్టరీ మేగజైన్' అనే పత్రిక పెట్టి చిన్నకథలు రాసే రచయితలెందర్నో ప్రోత్సహించారు. డిటెక్టివ్ సాహిత్యానికి వీరి పత్రిక చేసినంత సేవ మరో పత్రిక చేయలేదంటే అతిశయోక్తి కాదేమో. వీరు తమ సమకాలికులైన రచయితల కథాసంకలనాలెన్నింటికో సంపాదకత్వం వహించారు. బాల సాహిత్యాన్ని కూడా విస్మరించకుండా 'ఎలెరీ క్వీన్ జూనియర్' అనే కలం పేరుతో బాల డిటెక్టివ్ సాహిత్యం సృష్టించారు. ప్రపంచ ప్రఖ్యాతి



మాన్ఫ్రెడ్ లీ

చెందిన డిటెక్టివ్ రచయితల రచనలెన్నింటినో వాత్సల్యంతో సహా సేకరించి వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ అపురూపమైన సేకరణను అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీలో ఇప్పుడు భద్రపరిచారు.

డిటెక్టివ్ సాహిత్యంలో ఉత్తమ శిల్పానికి ఎలెరీ క్వీన్ రచనలు మచ్చుతునకలు. అయితే 1942 తర్వాత వచ్చిన ఎలెరీ క్వీన్ నవలల్లో నాణ్యత క్రమంగా తగ్గుముఖం పట్టినట్టు కనబడుతుంది. 1971 లో మాన్ఫ్రెడ్ లీ మరణించాడు. ఆ తర్వాత ఫ్రెడెరిక్ డానే ఒక్కడే ఎలెరీ క్వీన్ పేరుతో రచనలు కొనసాగించారు.

అగాథాక్రిస్టీ, ఎర్ల్ స్టాన్లీ గార్డ్‌నర్ వంటి హేమాహేమీల పక్కన శాశ్వతంగా నిలబడే గొప్ప పేరు ఎలెరీ క్వీన్.

— దాదా హయాత్



ఫ్రెడెరిక్ డానే